
# బాంధవ్యాలు



మనీ కన్నా మమతలు ముఖ్యమని చెప్పే కథ

**అరుణ**

సమయం శనివారం సాయంత్రం ఆరు గంటలైంది.

బ్యాంక్ నుండి ఇంటికి చేరుకున్న మోహన్‌కు అత్తగారు బయటికి వచ్చి చెప్పులు వేసుకోవడం కనిపించింది.

అల్లుడ్ని చూసి కళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయిందామె.

అత్తగారు ఎందుకు కంటతడి పెడుతూ వెళ్లిపోయిందో అతనికి అర్థం కాలేదు.

ప్రశ్నార్థకంగా లోపలికి వెళ్లి వంట గది వైపు చూశాడు.

భార్య మాధవి పని చేసుకుంటూ కనిపించింది. అతని వైపు చూసి పనిలో నిమగ్నమైంది కానీ ఏమీ మాట్లాడలేదు.

పిల్లలిద్దరూ కంప్యూటర్ ముందు కూర్చుని గేమ్స్ ఆడుతూ నవ్వుకుంటున్నారు.

అత్తగారు ఎందుకు దుఃఖపడుతోంది? అతను ఆలోచనలో పడ్డాడు.

రెండు వీధుల అవతల ఉన్న వదినగారి ఇంట్లోనే ఉంటోందామె.

కన్నతల్లి మీద తన భార్యకు చెప్పుకోదగ్గ ప్రేమాభిమానాలు లేవని అతనికి తెలుసు.

తనతో ఎంతో సఖ్యంగా ఉంటూ పిల్లల్ని ఎంతో అపురూపంగా చూసుకుంటుంది మాధవి.

భర్త తరపు బంధువులు వస్తే ఆదరంగా ప్రవర్తిస్తూ గౌరవ మర్యాదలకు లోటు లేకుండా చూసుకుంటుంది. కానీ ఆమె తల్లితోను, సొంత అక్కతోను అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తుంది.

ఆలోచిస్తూనే స్నానం చేశాడు. అలసట మటుమాయమై మనసుకు హాయిగా అనిపించింది.

శనివారం నాడు రాత్రిపూట అతను భోజనం చేయడు. కూరగాయలు, పండ్లు తిని సరిపెట్టుకుంటాడు.

క్యారెట్, టమోటా, కీరా దోస ముక్కలు ప్లేట్‌లో సర్ది అతని ఎదుట ఉంచింది.

భార్య సీరియస్‌గా ఉండడం వల్ల అతను మాట్లాడించదలచుకోలేదు.

యాపిల్ ముక్కలు, కమలాతొనలు ఉన్న ప్లేట్ కూడా అతని ఎదుట ఉంచి కిచెన్‌లోకి వెళ్లింది పని మీద.

తినడం ముగించి డైనింగ్ టేబిల్ వద్ద నుండి లేచి వెళ్లి పిల్లల దగ్గర కూర్చున్నాడు.

వాళ్లు ఆడుతున్న కంప్యూటర్ గేమ్స్ చూస్తూ పిల్లల నవ్వుల్లో పాల్పంచుకున్నాడు.

కాస్సేపు స్కూల్‌లో విశేషాలు తండ్రికి చెప్పారు ఇద్దరూ పోటీపడి.

తల్లి భోజనానికి పిలవడంతో కంప్యూటర్ ఆఫ్ చేసి వెళ్లి భోజనం చేశారు. మరో అర్థగంట తర్వాత పిల్లలు చదువులో పడ్డారు. పెద్దవాడు అభినవ్ ఆరో తరగతి, చిన్నవాడు అక్షయ్ నాల్గవ తరగతి చదువుతున్నారు.

పేపర్ చూస్తూ కూర్చున్నాడు మోహన్. టీవీ పెట్టి పిల్లల ఏకాగ్రతకు భంగం కలిగించడం అతనికి ఇష్టం ఉండదు. టీవీ కార్యక్రమాల మీద అంతగా ఆసక్తి కూడా లేదు.

పది గంటలకు పిల్లలు చదువుకోవడం ముగించి పడుకున్నారు.

తలుపులు వేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది మాధవి.

"ఈవేళ నీ మూడ్ బాగోలేదు. ఎందుకలా ఉన్నావు మధూ?" అనునయంగా అడిగాడు.

"అలాంటిదేమీ లేదు. బాగానే ఉన్నాను" మంచం మీద అతని పక్కన కూర్చుంటూ అంది.

ఆమె ముఖం మీద రేఖామాత్రంగా నవ్వు కనిపించినా కళ్లలో ఏదో బాధ కొట్టొచ్చినట్టు కనిపించింది.

"మీ అమ్మ వచ్చి వెళ్లడం చూశాను" అన్నాడు.

మాధవి మాట్లాడలేదు.

"అత్తయ్య కన్నీళ్లు తుడుచుకుంటూ వెళ్లింది?!" ప్రశ్నార్థకంగా అడిగాడు.

చివాలున తలెత్తి అతని వైపు చూసింది.

"కొద్ది రోజుల నుండి ఒంట్లో బాగుండడం లేదట. ఎడమ భుజం బాగా నొప్పిగా ఉండి కదిలించలేకపోతోందట. డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లమని అడిగింది"

"డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్లావా? ఏమన్నారు?" ఆతురతగా అడిగాడు.

"ఊహూ! తీసుకు వెళ్లలేదు. నాలుగు తిట్టి పంపించాను" మాధవి ముఖంలోను, మాటల్లోను కోపం తొంగి చూసింది.

"డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లమని కన్నతల్లి అడిగితే తిట్టి పంపించావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ఉన్న ఆస్తి అంతా పెద్ద కూతురికి ఇచ్చేసి అక్కడే ఉంటోంది కదా! ఒంట్లో బాగుండకపోతే ఇప్పుడు డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లడానికి నేను గుర్తు కొచ్చాను కానీ ఆస్తి ఇవ్వడానికి జ్ఞాపకం రాలేదు. నాకు ఒళ్లుమండి ఇదే మాట అన్నాను. ఏడుస్తూ వెళ్లిపోయింది కాబోలు. నేను చూడలేదు"

"తప్పు చేశావు మధూ" అన్నాడు.

"తప్పుచేసింది నేను కాదు, మా అమ్మ" రోషంగా అంది.


భార్య ముఖంలోకి అలాగే చూస్తుండిపోయాడు.


అత్తమామల ఆర్థిక స్థితిగతులు అతనికి తెలుసు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిలో కట్నకానుకలు ఇచ్చి, తమ కింద కొంత ఆస్తిని అట్టిపెట్టుకున్నారు. తమ తదనంతరం మిగిలిన ఆస్తి ఇద్దరు కూతుళ్లకు సమానంగా దక్కుతుందని పెళ్లయ్యాక మాటల సందర్భంలో మామగారు అతనితో చెప్పినా మోహన్ ఆ విషయానికి పెద్దగా ప్రాధాన్యమివ్వలేదు.

మాధవి, మోహన్‌ల పెళ్లయిన నాలుగేళ్లకే ఆమె తండ్రి అనారోగ్యంతో మరణించాడు.

భర్త పోయిన దుఃఖం నుండి కోలుకోక ముందే మాధవి తల్లికి ఊహించని విధంగా మానసికంగా మరో దెబ్బ తగిలింది.

వ్యాపారంలో పెద్ద అల్లుడు నష్టపోయి అప్పులపాలవ్వడంతో కూతురు పడుతున్న బాధను చూసి ఆమె తట్టుకోలేకపోయింది. వేదన తట్టుకోలేక కూతురు, అల్లుడు ఆత్మహత్య చేసుకుంటారేమో అన్నంత భయం కలిగింది కూడా. కాలయాపన చేయకుండా తనకు





ఉన్న ఇల్లు, ఖాళీ స్థలం, బంగారం అమ్మేసి అల్లుడి చేతిలో పెట్టింది.ఆమె ఇచ్చిన సొమ్ముతో అప్పులన్నీ తీర్చేసి ఋణవిముక్తుడై నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడతను. తాను నోరు తెరిచి అడగకపోయినా అత్తగారు సాయం చేసి ఆదుకున్నారన్న కృతజ్ఞత పెద్దల్లుడి మనసులో ఉంది. అతని మనసు మంచిదే కానీ కాలం కలిసిరాక వ్యాపారంలో నష్టపోయాడు. పల్లెలో పూర్వీకుల నాటి చిన్న పెంకుటింటికి మారి శేషజీవితాన్ని అక్కడే గడపాలని నిర్ణయించుకున్న అత్తగారిని మనఃస్ఫూర్తిగా తమ కుటుంబంలోకి ఆహ్వానించాడు.

కూతురు, అల్లుడు ఇద్దరూ ప్రాధేయపడడంతో పల్లెకు వెళ్లాలన్న ఆలోచన విరమించుకుని పెద్దకూతురి ఇంట్లోనే ఉండసాగింది వృద్ధురాలు.

భార్యాబిడ్డలను పోషించుకోడానికి గత్యంతరం లేక ఒక షాపులో గుమస్తాగా చేరి ఇల్లు నెట్టుకొస్తున్నాడు మాధవి బావ పతంజలి. భర్త అవస్థలు చూడలేక తాను కూడా పనిచేయాలని నిశ్చయించుకుంది మాధవి అక్క సుమతి.

ఇంట్లో ఖాళీ సమయంలో పచ్చళ్లు, జంతికలు, లడ్డూలు తయారుచేసి ఊళ్లో ఉన్న సూపర్‌బజార్‌లు రెండు, మూడింటికి సరఫరా చేస్తూ కొంత ఆదాయాన్ని గడిస్తోంది. పొదుపుగా సంసారం గడుపుతూ పిల్లలిద్దరినీ మున్సిపల్ హైస్కూల్‌లో చదివిస్తూ కాలం గడుపుతున్నారు ఆ దంపతులు.

అమ్మ మీద, అక్కమీద అంతకు ముందు ఉన్న ప్రేమాభిమానాలు మాధవి మనసులో ఇప్పుడు మచ్చుకైనా లేవు.

తల్లి ఎప్పుడైతే ఆస్తి అంతా అమ్మేసి అక్క బావల చేతుల్లో డబ్బు ధారపోసిందో ఆనాటి నుండి వారి ముగ్గురి మీద కోపాన్ని, ద్వేషాన్ని పెంచుకుంది. తనకు రావలసిన సగం వాటాను సుమతి తీసుకుందని ఆమె మీద కోపం.

నాన్న సంపాదించిన ఆస్తిని తనకు ఇష్టమైన విధంగా వాడుకునే హక్కు ఉందని చెప్పి యావదాస్తిని అమ్మేసి మొత్తం డబ్బు అక్కకు ఇచ్చిందని తల్లి మీద పీకల వరకు కోపం ఉంది. వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయిన బావగారి మీద తేలిక భావం ఏర్పడింది మాధవి మనసులో.

అమ్మ మీద, అక్కా బావల మీద ఏర్పడిన వ్యతిరేక భావాలు ఇన్నాళ్లు గడిచినా ఇంకా తగ్గుముఖం పట్టలేదు.

అక్క సుమతి జాతకానికి విరుద్ధంగా మాధవి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది.

పెళ్లినాటికి మోహన్ బ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం చేసేవాడు. పెళ్లయిన రెండు నెలలకే భర్తకు ఆఫీసర్‌గా ప్రమోషన్ రావడంతో తన అదృష్టం మీద మాధవికి విపరీతమైన నమ్మకం ఏర్పడింది. ముత్యాల్లాంటి ఇద్దరు బిడ్డలు కలిగారు. పిల్లలు తమ తెలివితేటలతో ఆటపాటలతో అలరిస్తుంటే తన అదృష్టాన్ని తలచుకుని మురిసిపోయేది మాధవి.

భర్త ఆఫీసర్‌గా అంకితభావంతో పనిచేస్తూ మరికొద్ది సంవత్సరాలకే మేనేజర్ అవడంతో మాధవి ఆనందానికి అవధులు లేకపోయాయి.

మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చిన తర్వాత తోడల్లుడు ఉంటున్న ఏలూరు ట్రాన్స్‌ఫరైంది రెండు నెలల క్రితం. తల్లిని, అక్కను అప్పుడప్పుడు

కలుసుకోవచ్చని మాధవి సంబరపడుతుందేమో అనుకున్నాడు మోహన్. కానీ భార్య ముఖంలో అలాంటి సంతోషం మచ్చుకైనా కనిపించలేదు.

ఒకే ఊళ్లో ఉంటున్నారు కదా చూడాలనిపించి తల్లి ఎప్పుడైనా వస్తే ముభావంగా పలకరిస్తుంది తప్ప మాధవి ఆమె పట్ల ఆత్మీయత కనబరచదు. ఇంట్లో అందరినీ పలకరించి కొద్దిసేపుండి వెళ్లిపోతుందామె.

వృద్ధురాలి పట్ల మాధవి ప్రేమాభిమానాలు కనబరచకపోవటం మోహన్ గ్రహించినా ఏమీ అనకుండా ఇన్నాళ్లు ఊరకుండిపోయాడు.

ఆలోచనల్లో నుండి బయటపడ్డాడు మోహన్.

"కన్నతల్లితో అలా మాట్లాడడం తప్పు మధూ!" అనునయంగా అన్నాడు.

"కన్నబిడ్డకు మా అమ్మ చేసిన ద్రోహం ముందు నేను కసిరికొట్టి మాట్లాడడం పెద్ద తప్పేమీ కాదు" తనను తాను సమర్థించుకుంది.

"మీ అమ్మ నీకు ద్రోహం చేసిందని ఇప్పటికి చాలాసార్లు అన్నావు. ఇన్నాళ్లు ఈ విషయంలో నేను జోక్యం చేసుకోలేదు. కానీ ఇవాల్టి నీ ప్రవర్తన, మాటతీరు చూశాక ఇక బ్రెయిన్‌వాష్ చేయక తప్పదని అర్థమైంది.

తల్లిదండ్రులకు తమ పిల్లలందరి మీద సమానమైన ప్రేమాభిమానాలు ఉంటాయి. నీ రెండు కళ్లు నీకు ఎలా సమానమో, మీ అమ్మ దృష్టిలో కూడా మీ అక్క చెల్లెళ్లిద్దరూ సమానమే. కష్టాల్లో ఉన్న బిడ్డ మీద తల్లికి సానుభూతి ఉంటుంది. తన బిడ్డను ఎలాగైనా ఆపద నుండి గట్టెక్కించాలని ఆరాటపడుతుంది. మీ అమ్మ కూడా అదే చేసింది. పెళ్లిలో నీకు ఇవ్వాల్సిన కట్నం ఎలాగూ ఇచ్చాం కదా అనుకుంది. తన భర్త సంపాదించిన ఆస్తిని ఏం చేసినా ఎవరికీ సమాధానం చెప్పనవసరం లేదనుకుంది. ఇల్లు, బంగారం, స్థలం అమ్మేసి ఆ డబ్బుతో పెద్దకూతురి కుటుంబాన్ని అప్పుల ఊబి నుండి బయటపడవేయగలిగింది.

గొప్పగా బతకలేకపోయినా కనీస అవసరాలకు లోటు లేకుండా ఇన్నాళ్లు మీ అక్క దగ్గరే కాలక్షేపం చేసింది. తనను డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పించమని మీ అక్కను అడగడానికి సంకోచించి బహుశ ఈ విషయం ఇంట్లో చెప్పకుండా మన ఇంటికి వచ్చి నోరు తెరిచి అడిగిందేమో! కన్నతల్లిని సాటి మనిషిగా కూడా ఆదరించకుండా కసిరికొట్టి పంపించావు. ఆమెకు కష్టం కలిగేటట్లు మాట్లాడి తప్పు చేశావు మధూ!"

భర్త మాటలకు అపరాధిలా తలదించుకుంది మాధవి.

"ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. డాక్టర్ దగ్గర అప్పాయింట్‌మెంట్ తీసుకుంటాను. రేపు ఉదయం మీ అమ్మను హాస్పిటల్‌కు తీసుకువెళదాం. మందులు వాడుతూ కొద్ది రోజులు మన ఇంట్లోనే ఉండమని చెప్పు. ఖర్చు గురించి వెనుకంజ వేయాల్సిన అవసరం లేదు"



అలాగే అన్నట్లు తలూపింది.

"మా నాన్న మిగిల్చిన ఆస్తిలో నాకు వాటా దక్కలేదన్న కోపంతో అలా ప్రవర్తించాను. నేను ఎంత సంకుచిత ధోరణితో వ్యవహరించానో అర్థమైంది" ఆమె మాటల్లో పశ్చాత్తాపం తొంగి చూసింది.

"బాంధవ్యాలను నిలబెట్టుకునేందుకు ఆర్థికపరమైన విషయాలు అడ్డుగోడగా ఉండకూడదు. మన కంటే తక్కువ స్థాయిలో ఉన్న బంధువులతో అనుబంధాన్ని నిలుపుకుంటూ హద్దుమీరకుండా వ్యవహరిస్తూనే వారు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనివ్వాలి"

అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు తలూపింది.

"ఈ రోజు సాయంత్రం ఒక డిపాజిటర్‌ను కలవడానికి వెళ్లినపుడు అనుకోకుండా మీ బావ పతంజలి కనిపించారు. కాస్సేపు మాట్లాడుకుందాం రమ్మని బలవంతంగా నా వెంట బ్యాంక్‌కు తీసుకువెళ్లాను.

మీ అక్క పచ్చళ్లు, స్వీట్లు మొదలైనవి తయారుచేసి అమ్ముతోందని నాకు తెలుసు. వీటిని ఖాతాదారులకు నేరుగా అమ్ముకునేందుకు వీలుగా హోం ఫుడ్స్ షాపు తెరిస్తే బావుంటుందని మాటల మధ్యలో అన్నాను. అలా చేయాలన్న కోరిక ఉన్నా పెట్టుబడికి డబ్బు లేదని మీ బావ చెప్పారు. మా బ్యాంక్ నుండి లోన్ ఇస్తామని చెప్పాను. ఆయన ఎంతగా సంతోషించారో మాటల్లో చెప్పలేను. షాపు పెట్టిన తర్వాత మీ అక్క, బావ మంచి స్థితికి ఎదుగుతారన్న నమ్మకం నాకుంది" దృఢంగా అన్నాడు మోహన్.

తోడల్లుడి కుటుంబానికి చేయూతనందిస్తున్న అతని సంస్కారానికి అబ్బురపడుతూ చూసింది మాధవి. ఆమె మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

భర్త చేతిని తన చేతుల్లోకి తీసుకొని ఇష్టంగా చెంపలకు ఆనించుకుంది. పట్టరాని సంతోషం కలిగినప్పుడు ఆమె అలాగే చేస్తుంది.

చిరునవ్వుతో భార్య ముఖంలోకి చూస్తూండిపోయాడు మోహన్.

## ‘ముద్దు’గుమ్మ

బాలీవుడ్‌లో ‘కిస్సింగ్ హీరో’గా ఇమ్రాన్ హష్మికి ‘గొప్ప’ పేరుంది. దాదాపు అతని ప్రతి సినిమాలో హీరోయిన్‌తో ముద్దుసీను వుంటుంది. అయితే కొత్తగా నిర్మాణంలో వున్న ‘తుమ్ మిలీ’ అనే సినిమాలో మాత్రం ఓ రివర్స్ సీన్ వుందిట. ఇందులో హీరోయిన్ సోహా అలీ ఖాన్ మాత్రం ఇమ్రాన్‌ని ముద్దు పెట్టమని అతన్ని వెంబడిస్తుందిట. సినిమాలో చాలాసార్లు ఇలాగే అంటుందిట. ఇంతకీ ఆ ముద్దుసీన్ వుందా లేదా అనేది ఆ సినిమా రిలీజయ్యే వరకూ సస్పెన్స్ అంటున్నారు నిర్మాతలు.